క్లుప్తంగా

అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు

కోటబొమ్మాళి: మద్యంషాపుల్లో అధిక ధరలకు మద్యం విక్రయించడం, బెల్టుషాపులు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కోటబొమ్మాళి ఎక్సైజ్ సీఐ గాయత్రి హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకరికి మూడు మద్యం బాటిళ్లు, ఒక బీరు బాటిల్ మాత్రమే విక్రయించాలనే నిబంధనలు పాటించని షాపులపై తగుచర్యలు తీసుకుంటామన్నారు.

ప్యాసింజర్ రైలుకు హాల్ట్ కల్పించాలి

టెక్కలి: విశాఖపట్టణం నుంచి బరంపురం రాకపోకలు సాగిస్తున్న ప్యాసింజర్ రైలుకు హరిశ్చంద్రాపురం రైల్వే స్టేషన్ వద్ద హాల్ట్ కల్పించాలని సామాజిక కార్యకర్త జి.అప్పన్న సోమవారం ఓ ప్రకటనలో కోరారు. కరోనా నేపథ్యంలో హాల్ట్ తీసివేశారని ఇప్పుడు మరళా హాల్ట్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్‌కు లేఖ రాసినట్లు పేర్కొన్నారు.

108 వాహన సిబ్బంది నిరసన

కాశీబుగ్గ: సమస్యల పరిష్కారం కోరుతూ 108 వాహన సిబ్బంది సోమవారం నిరసన చేపట్టారు. కాశీబుగ్గలో వాహనాలను పక్కపక్కనే నిలిపివేసి నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని నినాదాలు చేశారు. పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని, ఇంక్రిమెంట్లు పూర్తిస్థాయిలో అమలయ్యేలా చూడాలని, ఈఎంటీ పోస్టుల భర్తీలో 108 సిబ్బంది సర్వీస్‌ను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. వెంకటరావు, సత్యం, తారకేశ్వరరావు, డిల్లీశ్వరరావు, ఉపేంద్ర, రాము, ఆనందరావు, కుమారస్వామి పాల్గొన్నారు.

టీపీవోగా వరప్రసాద్


సకలాభక్తుల వరప్రసాద్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీవో)గా సకలాభక్తుల వరప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొంతకాలంలో స్థిరమైన అధికారి లేక పోవడంతో మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగంలో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయి. ఇప్పుడు రెగ్యులర్ టీపీవో నియామకంతో ఆ విభాగం సర్దుకుంటుందని పలువురు భావిస్తున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు మందలింపు

పలాస: గురుదాసుపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త మడియా సరస్వతిని కాశీబుగ్గ సీడీపీవో కవిటి రాజ్యలక్ష్మి మందలించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన ఓ చిన్నారిని పట్టించుకోలేదని సరస్వతిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో కేంద్రాన్ని సోమవారం సందర్శించి పూర్వపరాలను పరిశీలించారు. గ్రామస్తుల సమక్షంలో ఆమె మాట్లాడుతూ.. ఏ చిన్నారైన కేంద్రానికి వచ్చినప్పుడు ఆదరించడం కనీస ధర్మమన్నారు. బయట గ్రామం నుంచి వచ్చిన వారిని ఒకలాగా, స్థానికంగా ఉన్న పిల్లలను మరోలాచూడడం తగదన్నారు.

అమలుకాని ఉచిత ఇసుక హామీ

పలాస: ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉచిత ఇసుక హామీ ఎక్కడా అమలు కావడం లేదని ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనరు జుత్తు వీరాస్వామి అన్నారు. చిన్న నీలావతి గ్రామంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం పూర్తిగా తుంగలో తొక్కిందన్నారు. ఇసుక లభ్యంకాని కారణంగా భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంఘం నాయకులు సవర బంగ్లా, తాపీ మేస్త్రీల సంఘం నాయకుడు కోదండరావు ఉన్నారు.

మద్యం దుకాణాల వద్ద ధరల బోర్డు ఏర్పాటు చేయాలి

టెక్కలి: మద్యం దుకాణాల వద్ద కచ్చితంగా ధరల బోర్డులను ఏర్పాటు చేయాలని ఎక్సైజ్ శాఖ టెక్కలి సీఐ షేక్ మీరా సాహెబ్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం అమ్మకాలు చేయాలన్నారు. ఎంఆర్‌పీ కంటే అధికంగా వసూలు చేస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టెక్కలి ఎక్సైజ్ శాఖ పరిధిలోని టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి మండలాల పరిధిలో ఉన్న 11 మద్యం దుకాణాల యజమానులు నిబంధనలు పాటించాలని, 21 సంవత్సరాలు దాటిన వారికి మాత్రమే మద్యం అమ్మకాలు చేయాలని పేర్కొన్నారు.

ఆహ్లాదం.. ఆమడ దూరం!

- పలాస–కాశీబుగ్గలో రూపు కోల్పోయిన పార్కులు
- చిన్నారులకు ఆట వస్తువులు, ఆటవిడుపు కరువు


అధ్వానంగా ఉన్న నెహ్రూ పార్కు

కాశీబుగ్గ:

రోజంతా వివిధ పనుల్లో కష్టపడి సాయంత్రం వేళ పార్క్‌కు వెళ్తే మనసుకు కాస్తా ఉపశమనం కలుగుతుంది. అక్కడ కొద్దిసేపు గడిపితే హాయిగా ఉంటుంది. చాలామంది మార్నింగ్, ఈవినింగ్ వాకింగ్ కోసం పార్కులనే ఆశ్రయిస్తారు. కానీ పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్రజలకు అలాంటి అదృష్టం లేదు.

పేరుకే గ్రేడ్–2 మున్సిపాలిటీ తప్పితే ఇక్కడ ఉన్న మూడు పార్కులు రూపు కోల్పోయాయి. సుమారు లక్ష మంది నివసించే జంట పట్టణాలలో ఒక్కపార్కు లేకపోవడంపై పెదవి విరుస్తున్నారు. 31 వార్డులు కలిగిన పట్టణ వాసులు ఆహ్లాదానికి దూరమవుతున్నారు. గతంలో మూడు పార్కులు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచిపెట్టేవి. వీటిలో ఒక్కటి కూడా ఇప్పుడు వినియోగంలో లేవు.

ముత్యాలమ్మ కోనేరు..

పలాస–కాశీబుగ్గ జంట పట్టణాలను కలుపుతూ మధ్యలో ఉన్నటువంటి ముత్యాలమ్మ కోనేరు ప్రాంతాన్ని 20 ఏళ్ల క్రితం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో సుందరంగా తయారీ చేసి నెహ్రూ పార్కుగా పేరు పెట్టారు. అయితే తరువాత ఎవరూ దీన్ని పట్టించుకోలేదు. దీంతో రూపం కోల్పోయింది. ఉన్న మొక్కలను, సౌకర్యాలను తొలగించారు. గతంలో చిన్నారులకు వివిధ ఆట వస్తువులు, జిమ్ పరికరాలు ఉండేవి. ఇప్పుడు ఏమీ మిగల్లేదు. వాకర్స్‌క్లబ్ సభ్యులు ఏర్పాటు చేసిన కుర్చీలు సైతం లేవు. మున్సిపాలిటీ వారు కనీసం దీన్ని పట్టించుకోలేదు.


మురుగు గుంతగా ఉన్న కీర్తిరాయి చెరువు

కీర్తిరాయి చెరువు..

మున్సిపాలిటీ పరిధిని 10, 11, 12 వార్డుల ప్రజలకు సౌకర్యవంతంగా ఉన్నటువంటి కీర్తరాయి పార్కు (చెరువు) ప్లాస్టిక్ చెత్తతో నిండిపోయింది. స్నానాలు చేయడానికి సైతం పనికిరాని స్థితికి చేరుకుంది. తెలుగు, ఒడియా ప్రజలు ఈ చెరువు వద్దే పుణ్య స్నానాలు ఆచరించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేక పోవడంతో తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. ఈ పార్క్ కూడా ఉపయోగంలో లేదు.

మురుగు గుంతగా భద్రమ్మ కోనేరు..


అభివృద్ధికి నోచుకోని భద్రమ్మ కోనేరు పార్కు

మున్సిపాలిటీ పరిధి 23, 24, 25 వార్డులతో పాటు ఉదయపురం, ఉల్లాసపేట, రెడ్డికవీధి పరిసర ప్రాంతాల ప్రజలకు భద్రమ్మ కోనేరు పార్క్ ఆహ్లాదాన్ని పంచిపెట్టేది. ఇప్పుడు చెత్తాచెదారాలతో మురుగు గుంతగా మారింది. పలాస పట్టణానికి దూరంగా ఉండడంతో మున్సిపాలిటీ అధికారులు కనీసం పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. సౌకర్యాలు లేకపోవడంతో ఇటువైపు ఎవరూ చూడని పరిస్థితి నెలకొంది.

వినియోగంలోకి తేవాలి



మున్సిపాలిటీ పరిధిలో నిరుపయోగంగా ఉన్న పార్క్‌లను వినియోగంలోకి తేవాలి. ముత్యాలమ్మ కోనేరు, కీర్తిరాయి చెరువు, భద్రమ్మ కోనేరు పార్కులకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాలి. చినబడం, పద్మనాభపురం, మొగిలిపాడు, ఎర్రచెరువు, జయరామచంద్రపురం ప్రాంతాలలోని చెరువులను మినీ పార్కులుగా తీర్చిదిద్దితే బాగుంటుంది. చెరువులు, కోనేరులు ఆక్రమణకు గురికాకుండా ఉంటాయి.


– బమ్మిడి సంతోష్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

మరమ్మతులు చేపడతాం



మున్సిపాలిటీలోని ప్రధాన పార్కులకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం. ప్రస్తుతం కార్తీకమాసం సందర్భంగా ఎక్కడా ఇబ్బందులు కలుగకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నాం. అనంతరం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తాం. ఎమ్మెల్యే గౌతు శిరీష, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులతో నెలవారీ సమావేశంలో చర్చించి ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తాం.

– ఎస్.రామారావు, కమిషనర్, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ


శిథిలావస్థకు చేరిన వాటర్ ఫౌంటేన్

ఇచ్ఛాపురంలో.. మూలకు చేరిన పరికరాలు!

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో కూడా పార్క్‌లు ఆహ్లాదాన్ని పంచలేకపోతున్నాయి. మున్సిపాలిటీలో రెండు పార్కులున్నాయి. పట్టణం మధ్యలో లక్షలాది రూపాయలు వెచ్చించి గాంధీ పార్కుని ఏర్పాటు చేశారు. చిన్నారుల కోసం ఏర్పాటుచేసిన ఊయలలు, రోప్‌లు,మినీరంగులరాట్నం, ఎగుడుదిగుడు బల్లలు, జారుడుబల్లలు, కిడ్‌బ్యాలెన్సింగ్ కేజ్ పూర్తిగా విరిగిపోయి దర్శనమిస్తున్నాయి. వాటర్ ఫౌంటేన్ పూర్తిగా శిథిలమైంది. పార్కు ఆవరణలో మరుగుదొడ్ల సదుపాయం కూడా లేదు. 2003లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పాదయాత్ర పూర్తి సందర్భంగా శ్రీసురంగిరాజావారి కోట వద్ద అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మూడెకరాల్లో ప్రజాప్రస్థాన వాటిక పార్కును ఏర్పాటు చేసింది. దీని నిర్వాహణ బాధ్యతలు ఏపీ టూరిజం శాఖకు అప్పగించారు. ఇప్పుడు పార్కు ఆలనాపాలన కరువై అధికారులెవరూ నిర్వాహణ గురించి పట్టించుకోకపోవడం లేదు. దీంతో పార్కులో ప్రైవేటు వ్యక్తులు వారి వాహనాలు నిలుపుకుంటున్నారు. ప్రజలకు ఆనందాన్ని.. ఆహ్లాదానిచ్చే విధంగా పార్కులను అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.




పాడైన ఆట వస్తువులు

మౌలిక సదుపాయాలు కల్పించాలి



పట్టణంలోని పార్కులు ఉపయోగంగా లేవు. ఉన్న వస్తువులు పాడైపోయాయి. అధికారులు వీటిపై దృష్టిసారించాలి. మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి. చిన్నారుల ఆటవస్తువులను బాగు చేయించాలి. మౌలిక వసతులు కల్పించాలి.

–ఆర్.ఎన్.మూర్తిపట్నాయక్, ఇచ్ఛాపురం

అభివృద్ధి చేస్తాం



మున్సిపాలిటీకి పూర్తిస్థాయి ఇంజినీర్ లేరు. దీంతో పార్కులో ఆటపరికరాలతో పాటు ఇతర సదుపాయాలు కల్పించేందుకు ఎస్టిమేట్లు వేయలేకపోయాం. కొద్ది రోజుల క్రితమే మున్సిపాలిటీకి ఇంజినీరింగ్ అధికారి వచ్చారు. ఎస్టిమేట్లు తయారు చేసి టెండర్లు పిలుస్తాం. పార్కులను అభివృద్ధి చేస్తాం.

–ఎస్.రమేష్, మున్సిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం

పంటల బీమాపై అవగాహన


చండిపురంలో రైతులతో మాట్లాడుతున్న మాధవీలత

కవిటి: ఉద్దానం ప్రాంతంలోని కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం, మండలాలకు చెందిన జీడి పంట సాగు చేస్తున్న రైతులు పంటల బీమాపై అవగాహన కలిగి ఉండాలని మండల ఉద్యానశాఖ అధికారిణి పోలాకి మాధవీలత అన్నారు. మండలంలోని చండిపురం, ఆర్.భైరిపురం గ్రామాల్లో బీమా పథకంపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. హెక్టారుకు రూ. నాలుగు వేలు పంటల బీమా ప్రీమియంగా రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రీమియం చెల్లించేందుకు ఈ నెల 15వ తేదీ వరకూ గడువు ఉందన్నారు. వివరాల కోసం వ్యవసాయ, ఉద్యానశాఖ సచివాలయ సహాయకులను సంప్రదించాలని సూచించారు.

దళిత మహిళపై దాడి చేసిన వారిని శిక్షించాలి


దమయంతిని పరామర్శిస్తున్న దళిత సంఘాల నాయకులు

కోటబొమ్మాళి: కిష్టుపురం గ్రామంలో దళిత మహిళ చల్ల దమయంతిపై దాడి చేసిన టీడీపీ కార్యకర్తలను కఠినంగా శిక్షించాలని జిల్లాకు చెందిన దళిత సంఘాలకు చెందిన పలువురు నాయకులు డిమాండ్ చేశారు. కోటబొమ్మాళి సామజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దమయంతిని సోమవారం పరామర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన అసలు సూత్రదారులను పోలీసులు కేసు నుంచి తప్పించారన్నారు. సమగ్ర దర్యాప్తు జరిపి దాడిలో పాల్గొన్న వారందరిపైనా కేసులు నమోదు చేయాలని కోరారు. అలాగే బాధితులపై పెట్టిన కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.పరామర్శలో జిల్లా దళిత సంఘాల నాయకులు ఎడ్ల గోపి, రాణా శ్రీను, దుర్గాసి గణేష్, భైరి ధనరాజు, లోపింటి నారాయణరావు, తిరుమల, కానుకుర్తి గోవింద్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు నివాళులు


జగన్నాయకులు సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, నాయకులు

కాశీబుగ్గ: పలాస మాజీ ఎమ్మెల్యే, జుత్తు జగన్నాయకులు ఏడో వర్ధంతిని నియోజకవర్గం వ్యాప్తంగా అభిమానులు సోమవారం నిర్వహించారు. తన స్వగ్రామమైన మందస మండలం బిడిమి గ్రామంలోని ఆయన ఘాట్ వద్ద సతీమణి ధనలక్ష్మి, తమ్ముడు నీలకంఠం, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు నివాళులర్పించారు. హరిపురంలో సర్పంచ్ జగన్నాథపురం పురుషోత్తం, శ్రీరాములు, నారాయణపురంలో సర్పంచ్ మామిడి సింహాద్రి, బత్తిని లక్ష్మణ్, కవిటి మండలం కపాసగుద్దులో అగ్నికుల క్షత్రియ సంఘ ప్రధాన కార్యదర్శి పులకల శ్రీరాములు ఆధ్వర్యంలో, వజ్రపుకొత్తూరు మండలం పూండిలో జిల్లా అగ్నికుల క్షత్రియ అధ్యక్షులు గొరకుల వసంతస్వామి ఆధ్వర్యంలో జగన్నాయకులు విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు.

పక్కాగా నైపుణ్య గణన

కంచిలి: నైపుణ్య గణనను పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో వి.తిరుమలరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేపట్టాలని, దీని వలన యువతకు వారి విద్యా, నైపుణ్యత ఆధారంగా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఎవ్వరినీ విడిచిపెట్టకుండా సర్వేను చేయాలన్నారు. సర్వే చేసే విధానంపై స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ టి.తేజేశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్ పి.జగదీష్, వెల్ఫేర్ అసిస్టెంట్ బి. రమేష్‌లు శిక్షణ ఇచ్చారు. ఐకేపీ ఏపీఎం ఎస్.ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వీవోఏలు పాల్గొన్నారు.

• శంభో శివ శంభో..

కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణతో మారుమోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని శివుడికి ప్రత్యేక పూజలు, క్షీర, శీర్షాభిషేకాలు చేశారు. దీపాలంకరణసేవల్లో పాల్గొన్నారు. హారతులను స్వామికి నివేదించారు. టెక్కలి మండలం రావివలసలోని ఎండల మల్లికార్జునస్వామిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు చర్యలు తీసుకున్నారు. స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. కొన్నిచోట్ల అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.


కవిటి: మహా మృత్యుంజయేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు


కంచిలి: పుణ్యభద్ర శివాలయంలో పూజలందుకుంటున్న శివుడు


సోంపేట: బారువ కోలింగేశ్వరస్వామి దేవాలయంలో క్యూలైన్లో భక్తులు


నందిగాం: ఉమా అగస్త్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కాశీబుగ్గ: చినబడాం 11 కేవీ ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ పనులు చేపట్టనున్నారు. దీంతో ఆ రోజు ఉదయం పది నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్టు పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యజ్ఞేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెంటిబద్ర, జయరామచంద్రపురం, పద్మనాభపురం, పద్మనాభ పురంకాలనీ, ఓల్డ్ ఎన్‌హెచ్–5రోడ్డు, తాళభద్ర, నీలాపురం, నర్సిపురం, రైల్వే గేట్‌డౌన్, పెసరపాడు, చినబాడాం, అంతరకుడ్డ, రాజపురం పరిసర ప్రాంతాలకు సరఫరాను నిలిపి వేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

టెక్కలి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా రేపు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల ఆరో తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జేకేసీ, అంజనాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉదయం పది గంటల నుంచి నిర్వహించే జాబ్‌మేళాకు ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

టెక్కలి రూరల్: టెక్కలి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి పొలం దుర్గామల్లేశ్వరరావు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని హెచ్‌ఎం దాసరి నాగభూషణం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 68వ స్కూల్ గేమ్స్ 14 సంవత్సరాల విభాగంలో జిల్లా స్థాయిలో ఇటీవల జరిగిన పోటీలో దుర్గామల్లేశ్వరరావు ప్రతిభ చూపడం ద్వారా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. ఈ నెల ఆరు నుంచి ఎనిమిదో తేదీ వరకు కడప జిల్లా అంగూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరగనున్న పోటీల్లో విద్యార్థి పాల్గొంటారన్నారు. దుర్గామల్లేశ్వరరావును పీడీలు రామిరెడ్డి, జగమ్మ, సిబ్బంది అభినందించారు.

విత్తనాలు పంపిణీ



టెక్కలి మండలం అక్కవరంలో సోమవారం వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై వీటిని పంపిణీ చేసినట్లు ఏవో రంగారావు చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు బి.శేషు, అధికారులు పాల్గొన్నారు.

–టెక్కలి

భక్తుల అవస్థలు



రావివలస ఎండల మల్లన్న దర్శనానికి సోమవారం నడిచి వెళ్లిన భక్తులు అవస్థలకు గురయ్యారు. ఎన్‌ఎం రోడ్ జంక్షన్ నుంచి రావివలస వరకు జరుగుతున్న రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండడంతో రాళ్లు తేలిపోయాయి. మరో వైపు సుదూర ప్రాంతంలో వాహనాలు నిలిపివేశారు. దీంతో నడక మార్గంలో వెళ్లే భక్తులకు రాళ్లు గుచ్చుకుని ఇబ్బందులు పడ్డారు. రెండో సోమవారం పూజలకైనా రోడ్డు పనులు పూర్తి చేయాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

–టెక్కలి

రోడ్డు పనులు ప్రారంభం



మండపల్లి పంచాయతీ బుద్దేవుపేట సాయిబాబా గుడి నుంచి స్నానాల చెరువు వరకు 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.4 లక్షలతో సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. సర్పంచ్ పిట్ట శశిరేఖ పనులకు భూమి పూజ చేశారు. మండపల్లిని ఆదర్శ పంచాయతీగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పిట్ట మామయ్యరెడ్డి, గ్రామ పెద్దలు ఆశి పేరయ్య, బుడుపు మామయ్యరెడ్డి, తిప్పన కూర్మయ్య, మోహనరావు పాల్గొన్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

నీటి కోసం తిప్పలు..



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 30వవార్డు ఉదపురం పరిధిలో ఉన్నటువంటి హట్కోకాలనీలో ఏర్పాటు చేసిన సుజలధార పనిచేయక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది రోజులుగా మరమ్మతులకు గురైనప్పటికీ పట్టించుకునే నాథుడు లేకుండా పోయారు. దీంతో ఏడు రూపాయలకు 20 లీటర్ల ఫిల్టర్‌వాటర్ అందని పరిస్థితి నెలకునంది. బాగుచేసి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

–కాశీబుగ్గ